www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 జనవరి 2026
5
వైఎస్ఆర్




నగరంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి శుక్రవారం నగర పర్యటనలో భాగంగా వెస్ట్, సౌత్ జోన్లు సందర్శించారు. వెస్ట్ జోన్‌లోని పాలెంపల్లెలో ప్రజలతో మాట్లాడుతూ రోజూ చెత్తను సేకరిస్తున్నారా, కాలువలు తీస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికుల హాజరును తనిఖీ చేశారు. పల్లె ప్రాంతం ఉన్న ఏరియాలో ఎక్కువ పారిశుధ్య పనులు నిర్వహించాలని సంబంధిత అధికారులని ఆదేశించారు. పర్యటనలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, ఆరోగ్య అధికారి డాక్టర్ రమేష్, ఇన్‌ఛార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ మహేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ రిమ్స్ వద్ద ఉన్న అంబేద్కర్ భవన్‌ను పరిశీలించారు. భవనం సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సందర్శనలో మునిసిపల్ కార్పొరేషన్ ఎస్ఇ చిన్నకేశవ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిప్యూటీ ఇఇ, ఎఇలు ఉన్నారు

టిఫిన్ బండ్లపై 'బండ' బాదుడు



తాజాగా వాణిజ్య గ్యాస్‌పై రూ.111 పెంపు

ఇడ్లీ, మిర్చి, దోశ బండ్ల వ్యాపారుల ఆందోళన

కేంద్ర ప్రభుత్వ తీరుపై సర్వత్రా నిరసన

కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతుండడంతో చిరువ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారుతున్నది. వ్యాపారం మానుకోలేక మనుగడ కొనసాగించలేక సతమతమవుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న గ్యాస్ ధరలతో రోజు కూలీ కూడా గిట్టుబాటు కాకపోవడంతో చిరు వ్యాపారులు తీవ్ర ఆవేదన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్పాహారమైన ఇడ్లీ, దోశ, మిర్చి బండ్లు నిర్వహించే వ్యాపారులు పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచితే వ్యాపారం దెబ్బ తింటుందేమోనన్న భయంతో నష్టాల్లోనే వ్యాపారం కొనసాగిస్తున్నారు. ప్రజలు ఆర్థికంగా చిక్కి శల్యమవుతున్న తరుణంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరు మరింత ఆవేదనకు గురిచేస్తుంది.

ప్రజాశక్తి - యంత్రాంగం

వాణిజ్య అవసరాలకు వినియోగించే వంట గ్యాస్ ధర (19 కిలోల) సిలిండర్‌పై రూ.111 చొప్పున పెంచుతున్నట్లు ఇంధన సంస్థలు ప్రకటించాయి. వాణిజ్య సిలిండర్‌పై ఇష్టమొచ్చినప్పుడల్లా ధర పెంచుతూ పోతున్న విషయం తెలిసిందే. చిరువ్యాపారులు, హోటల్ యజమానులపై భారం పడింది. ఇది వారికి గుదిబండగా మారింది. అసలే వ్యాపారం అంతంతమాత్రమే ఉండగా సిలిండర్ ధర పెంపు, నిత్యావసర సరకుల ధర పెరగడంతో వారి పరిస్థితి అధ్వానంగా తయారైంది. రోజుకు ఇద్దరు వర్కర్లకు రూ.1200 ఖర్చు అవుతుండగా పెట్టుబడి పోను కూలీ మాత్రమే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోశ, ఇడ్లీ, బొండ, గారె, మిర్చి వంటి పదార్థాలు ఎక్కువగా ప్రజలు వేడి వేడిగా కోరుకుంటారు. ఈ పదార్థాలను ఎప్పుడూ వేడిగా ఉంచాలంటే గ్యాస్ స్టవ్ ఎప్పుడు ఆన్‌లోనే ఉండాల్సి ఉంటుంది. గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి రోజుకు సిలిండర్‌కు రూ.1,733 చెల్లించాల్సి వస్తుండగా డబ్బులు సగం గ్యాస్‌కే పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన రూ.111తో రూ.1,844గా ఉంది. గ్యాస్, నిత్యావసర ధర పెరగడంతో ఆహార పదార్థాల రేట్లు పెంచలేక, వ్యాపారం మానుకోలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

ఇబ్బందిగా గ్యాస్ ధరలు

గ్యాస్ సిలిండర్ ధరలు తరచూ పెంచడం చాలా ఇబ్బందిగా మారింది. పెద్ద మొత్తంలో డబ్బులు కట్టి సిలిండర్ తీసుకోవాలంటే భయమేస్తుంది. ధరలు తగ్గకుంటే మళ్ళీ కట్టెల పొయ్యినే వాడాల్సి వస్తుంది. సిలిండర్‌తో పాటు విద్యుత్, బస్సు ఛార్జీలు, నిత్యావసర ధరలు పెరిగాయి. చాలా ఇబ్బంది పడుతున్నాం.

- కుమారి, చిరు వ్యాపారి, కమలాపురం.

గ్యాస్ ధరలు భారమవుతున్నాయి

సిలిండర్ ధర ఒక్కసారిగా రూ.111 పెంచారు. కొంత కాలంగా గ్యాస్ ధరలను పెంచు తుండడంతో భారమవుతున్నది. వ్యాపారాలు అంతంత మాత్రమే జరుగుతున్నాయి. ఈ పరిస్థితులలో ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి గ్యాస్ ధరలు తగ్గించాలి .

- పండు, టి హోటల్ నిర్వాహకుడు, మైదుకూరు.

పెంచిన సిలిండర్ ధరను తగ్గించాలి

19 కిలోల వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ధరను ప్రభుత్వం రూ.111 పెంచింది. ఈ సిలిండర్ గతంలో రూ.1770గా ఉన్న ధర ఇప్పుడు రూ.1881కి చేరుకుంది. వాణిజ్య ఎల్‌పిజి ధరల్లో చేసిన సవరణల కారణంగా వాటిపై ఆధారపడుతూ వ్యాపారాలు చేసుకునే మాలాంటి వారిపై ఆర్థిక భారం పడనుంది. ఈ ప్రభావం కొనుగోలు చేసే సామాన్యులపై కొంత వరకు ఉంటుంది. ప్రభుత్వం గ్యాస్ ధరలను తగ్గించి చిరు వ్యాపారులను ఆదుకోవాలి.

- చాన్‌బాషు, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు, చాపాడు.

చిరు వ్యాపారులపై భారం తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచడంతో చిరు వ్యాపారాలపై పెద్ద ఎత్తున భారం పడుతుంది. కొన్ని నెలలుగా ఒక గ్యాస్ సిలిండర్‌పై విపరీతంగా ధరలు పెంచడంతో మాలాంటి చిరు వ్యాపారాలు చేసుకునే వారిపై భారం పడుతుందని వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతున్నాం.

- శ్రీనివాసులు, చిరు వ్యాపారి, కడప.

వ్యాపారం సజావుగా జరగలేదు

గ్యాస్ సిలిండర్ ధర రూ.111 పెంచడంతో మాలాంటి చిరు వ్యాపారులపై భారం పడుతున్నది. ఉపాధి కోసం హోటల్ నడుపుతున్నా. గతేడాది వ్యాపారం సజావుగా జరగలేదు. ఇప్పుడు సిలిండర్ ధర పెంచడంతో నెలకు రూ.1500 అదనంగా చెల్లించాల్సి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం ధరలు తగ్గించి చిరువ్యాపారులను ఆదుకోవాలి.

- జిలానీ బేగం, బజ్జీ కొట్టు, కడప.

ధరలు పెంచలేం.. వ్యాపారం మానుకోలేం

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు భారంగా మారాయి. వ్యాపారం పుంజుకుంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న ధరలతో వ్యాపారాలు నిర్వహించే పరిస్థితి లేదు. లాభం రావాలంటే రేటు పెంచడం తప్ప మరో మార్గం లేదు. రేటు పెంచితే వ్యాపారం దెబ్బ తింటుందని భయంగా ఉంది.. ఇది తప్ప వేరే పని చేయలేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. ధరలను తగ్గిస్తే బాగుంటుంది.

- కిషోర్‌కుమార్‌రెడ్డి, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు, కడప.

టిఫిన్ సెంటరే జీవనాధారం

టిఫిన్ సెంటర్‌ను నడుపుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాము. రోజంతా కష్టపడితే ఖర్చులు పోను రూ.300 మిగులుతుంది. గ్యాస్ ధరలు పెంచితే ఇక మాకు కూలి కూడా గిట్టదు. టిఫిన్ సెంటర్ మూసేసి వేరే పని చూసుకోవాల్సిందే.

- యశోధ, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు, మదనపల్లె.

గ్యాస్ కొనాలంటే గుదిబండే

నిత్యావసర వస్తువులతోపాటు గ్యాస్, కూరగాయల ధరలు అమితంగా పెరిగాయి. వ్యాపార వినియోగ గ్యాస్ ధర భారీగా పెరగడంతో హోటల్ నడపడం చాలా భారంగా ఉంది. ఇలానే కొనసాగితే హోటల్ యాజమానులు అప్పుల పాలయ్యే ప్రమాదం ఉంది. పెంచిన గ్యాస్ బండ ధరను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలి

- రామకృష్ణ, హోటల్ నిర్వాహకుడు, రాయచోటి

నెలకు 12 సిలిండర్లు ఇవ్వాలి

నెలకు 12 సిలిండర్లు కావాలి. ఆ లెక్కన నెలలో రూ.సుమారు రూ.1350 నెలకు భారం పడుతుంది. ఈ భారం ఎవరిమీద వేయాలి. టిఫిన్ క్వాలిటీ అయినా తగ్గించాలి, ధర అయినా పెంచాలి. ఈ రెండింటిలో ఏది జరిగిన హోటల్ మూతపడుతుంది. గ్యాస్ ధర తగ్గించి సామాన్యుడిని ఆదుకోవాలి.

- చిన్నోడు, హోటల్ నిర్వాహకుడు, మదనపల్లె.

ధర పెంపు వల్ల అనదపు భారం

గ్యాస్ ధర పెంపు వల్ల అదనపు భారం పడుతుంది. ఇప్పటికే నిత్యావసర, కూరగాయలు ధరలు పెరిగాయి. గ్యాస్ ధర పెరగడం వల్ల వచ్చే ఆదాయం దగ్గి కుటుంబ పోషణ భారంగా మారనుంది. ప్రభుత్వాలు ఆలోచించి చిన్న వ్యాపారులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి

- పి.బాబు, చికెన్ పకోడి బండి, పులివెందుల.

ధర పెంపుతో మరింత భారం

రోజువారీగా తయారీకి అవసరమయ్యే సరుకుల ధరలు పెరిగాయి. అదే రీతిలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడంతో హోటళ్లు నడిపించడం మరింత భారంగా మారింది. హోటల్ నిర్వహణకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నా తప్పని పరిస్థితిలో హోటల్‌ను నడిపిస్తున్నాం. ధరలు పెరుగుతూ పోతే హోటల్‌కు గిరాకీ తగ్గి బతుకు భారంగా మారుతుంది. ధరల తగ్గింపునకు చర్యలు తీసుకోవాలి.

- బాబ్జీ, టి హోటల్ నిర్వాహకుడు, వేంపల్లె.

వ్యాపారంలో మిగులు లేదు

నిత్యావసర సారుకులతో పాటు గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడంతో వ్యాపారంలో మిగులు లేదు. కుటుంబ పోషణ భారమైంది. నాయకులు చిరు వ్యాపారులకు గ్యాస్ ధరలు వెంటనే తగ్గించి వీధి వ్యాపారులకు ఆదుకోవాలని కోరారు. టిఫిన్ సెంటర్ మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ఇలా గ్యాస్ ధరలు పెంచుకుంటూ పోతే ఎలా?

- సుగుణమ్మ, టిఫిన్ సెంటర్, ప్రొద్దుటూరు.

పెండింగ్ ఆర్‌ఒబి పనులపై దృష్టి సారించాలి

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ఇప్పటివరకూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఆర్‌ఒబి (రోడ్ ఓవర్ బ్రిడ్జి) పనులపై దృష్టి సారించి అందులో భాగంగా చేపట్టే అన్ని రకాల పనులను త్వరితగతిన పూర్తి చేసేం దుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికా రులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రధానంగా రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులతో పాట ఆరోగ్యం రెవెన్యూ, వ్యవసాయం, వాహన పోర్టల్ సేవలు, ఎన్‌ఒసి తదితర అంశాలపై సంబంధిత కార్యద ర్శులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా చేశారు. ప్రధానంగా ఈనెల 9 వరకు ప్రభుత్వ రాజ ముద్ర, క్యుఆర్‌తో కూడిన పట్టదారు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులతో కలసి పక్కగా నిర్వహించాలని సూచించారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వచ్చే నెల 10 లోపల పూర్తి చేసేలా చూడాలని, డాక్యుమెంట్స్ అప్లోడ్ పై కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు రాజంపేట సబ్ కలెక్టర్ భావన, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం చేపడు తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటుప్రధానంగా రైల్వే మార్గాల పరిధిలో నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే ఆమో దం తెలిపిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబం ధించిన భూసేకరణ , పర్యావరణ అమతులు తదితర ప్రక్రియలపై ప్రత్యేక ద ృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాది లోపు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు సంబంధించి ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులు సంబంధిత రైల్వే అధికారులను సమన్వయం చేసుకుని తరచూ సమీక్ష చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రాజ ముద్ర, క్యుఆర్ కోడ్‌తో కూడిన పట్టదారు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పక్కగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివ ృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు చంద్రమోహన్, సాయిశ్రీ, జాన్ ఇర్విన్, చెన్నయ్య, సిపిఒ హాజంతయ్య, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దోమ పుట్టకూడదు.. కుట్టకూడదు

- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మనోరమ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

దోమ పుట్టకుండా దోమ కుట్టకుండా చూసుకోవాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ పేర్కొన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాఘవేంద్రతో కలిసి పిహెచ్‌సి పరిధిలోని రసూల్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులకు దోమల పెరుగుదల నివారణ చర్యలు, వాటి ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధుల లక్షణాలు, నివారణ పద్ధతులు, చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవలి కాలంలో కొన్ని ప్రాంతాలలో కనిపిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు, ప్రమాదాలు, సరైన సమయంలో చికిత్స పొందాల్సిన అవసరంపై ప్రత్యేకంగా వివరించారు. అనంతరం 'ఫ్రైడే డ్రై డే కార్యక్రమ ప్రాధాన్యతను ప్రత్యేకంగా వివరించారు. ప్రతి శుక్రవారం గ్రామస్తులంతా తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉన్న అన్ని చోట్లను ఖాళీ చేసి, శుభ్రం చేయడం ద్వారా దోమల ఉత్పత్తిని పూర్తిగా అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ, జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు,శరీరంపై దద్దుర్లు లేదా తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపించిన వెంటనే స్వయంగా మందులు వాడకుండా ప్రభుత్వం గుర్తింపు పొందిన అర్హత గల వైద్యుల వద్దనే చికిత్స పొందాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు శివశంకర్ రెడ్డి, మురళీధర్, స్థానిక ఆరోగ్య పర్యవేక్షకులు జనార్దన్, ఆరోగ్య సహాయకులు బ్రహ్మయ్య, రసూల్‌పల్లి సమాజ ఆరోగ్య అధికారి గణపతి పాల్గొన్నారు.

ప్రజా కళాకారుడు 'హాష్మీ'

- ప్రజానాట్య మండలి నగర కన్వీనర్ సి.పి.వరలక్ష్మి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా కళాకారుడు హాష్మీ చిత్రపటానికి ప్రజానాట్యమండలి నాయకులు శుక్రవారం పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి కార్యాలయంలో సబ్దర్ హాష్మీ 37వ వర్ధంతి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి నగర కన్వీనర్ సి.పి.వరలక్ష్మీ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కళా రూపాలు సృష్టించి తద్వారా ప్రజలలో చైతన్యం నింపిన మహనీయులు హాష్మీ అన్నారు. ప్రతి ప్రజా కళాకారుడు నిత్య విద్యార్థిలా ఉండాలని పేర్కొన్నారు. కులం, మతం, భాషా, ప్రాంతం, జాతి, లింగం, వివక్ష భావాలు, ఉన్మాదం లాంటివి విడనాడి ప్రజలను చైతన్య పరచిన మహనీయులు అన్నారు. అటువంటి మహనీయుల ఆశయాలని అందిపుచ్చుకుని రాబోయే రోజుల్లో మనం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వలసిగండ్ల సుబ్బరాయుడు, మీన, ధనలక్ష్మి, హరి, రామచంద్ర, శ్రీనివాసులు, రాజా, మోహన్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించండి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



రోడ్డు భద్రత వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రహదారి భద్రతపై అవగాహన కల్పించడం, ప్రమాదాలు తగ్గించడం, హెల్మెట్, సీటు బెల్ట్ వంటి నిబంధనలను పాటించేలా ప్రోత్సహించడం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా సచివాలయ లోని బోర్డు రూమ్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈనెల జనవరి 31 వరకు నిర్వహించనున్న 37 వ జాతీయ రహదారి భద్రత మహోత్సవాలకుసంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు 30 శాతం దాకా చనిపోతున్నారని అంచనా ఉందన్నారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, జిల్లా ఇన్‌ఛార్జి జెసి విశ్వేశ్వర్‌నాయుడు, జిల్లా రవాణా శాఖ అధికారి వీర్రాజు, ఎంవీఐలు విజయభాస్కర్ ప్రసాద్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** నగరంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ నిర్వహిస్తామని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేనిపక్షంలో రూ. 1000 జరిమానా విధిస్తామని కడప ట్రాఫిక్ సిఐ సురేష్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం హెచ్చరికలు జారీ చేస్తున్నా కొందరు వాహనదారులు అవేవీ పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలకు దారితీస్తున్నాయని తెలిపారు. ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ రూల్స్ పాటించని వారి విషయంలో కడప ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయే అవకాశాలు మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. **మైలవరం :** ద్విచక్ర వాహనదారులు ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మైలవరం ఎస్ఐ శ్యామ్ సుందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మైలవరం జలాశయం ఉత్తర కాలువ వద్ద ఎస్ఐ వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన రికార్డులు లేని వారికి జరిమానాలు విధించారు. హెల్మెట్ ఆవశ్యకతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆయన సూచించారు. తనిఖీలలో ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడు (మైదుకూరు) :** మైదుకూరు డిఎస్‌పి కార్యాల యంలో శుక్రవారం హెల్మెట్ ప్రాధాన్యత తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా డిఎస్‌పి రాజేంద్రప్రసాద్, బద్వేలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రావు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనంలో ప్రయాణించేవారు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. అనుకోకుండా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. నెల రోజులపాటు రహదారి భద్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ రమణారెడ్డి , ఎస్ఐ చిరంజీవి ,సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాకు

అసలైన ద్రోహులు శ్రీకాంత్‌రెడ్డి, ధనుంజయరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి

సిఎం చంద్రబాబు రాజ నీతిజ్ఞుడని ప్రపంచమంతా కీర్తిస్తున్నారని, ఆయన ఎంతో శాస్త్రీయంగా అందరి మనో భావాలను గౌరవించి జిల్లాల పునర్విభజన చేశారని టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నాయకునిపై వైసిపికి చెందిన కొందరు పెద్ద పెద్ద విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, ధనుంజయరెడ్డి కలిసి రాయచోటిని జిల్లాగా చేశారని తెలిపారు. ఇదంతా కుట్రలో భాగం అని విమర్శించారు. కడపకు కేవలం 50 కిలోమీటర్లు ఉండే రాయచోటిని జిల్లా చేశారని చెప్పారు. ఇటు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, కడపకు డైరెక్ట్ కనెక్టివిటీ ఉండే రాజంపేటకు ద్రోహం చేసి రాయచోటిని జిల్లా గా ప్రకటింప చేశారని విమర్శించారు. శ్రీకాంత్ రెడ్డి రాయచోటిని జిల్లా కేంద్రంగా చేసి వేల కోట్లు దోచుకున్నారని పేర్కొన్నారు. ప్రజలు గమనించి అతని కుట్రను భగ్నం చేసి ఓడించారని తెలిపారు. శ్రీకాంత్ రెడ్డి టిడిపి ప్రభుత్వంపై కుట్రలు, కుయుక్తులతో ఉద్యమాలు చేసిన 2029లో మళ్లీ తెలుగుదేశం పార్టీ రాయచోటిలో జెండా ఎగరేస్తుందని చెప్పారు. సమావేశంలో క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు పెనుబాల ప్రేమ్ కుమార్, టిడిపి ముస్లిం మైనార్టీ నాయకుడు అల్లా బకాష్, తెలుగు యూత్ నాయకుడు కంఠ కళ్యాణ్, యం.రఘురాం పాల్గొన్నారు.

వైవీయూ బోటనీ స్కాలర్ శైలజ రాణికి డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం బోటనీ స్కాలర్ వి.జె. శైలజ రాణికి వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆ శాఖ ఆచార్యులు ఎం.మధుసూదనరెడ్డి పర్యవేక్షణలో 'ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవిలోని అడవి అలంకార మొక్కలు (వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ నల్లమల్ల ఫారెస్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, ఇండియా)' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయ విసి మార్గదర్శకం మేరకు నియమితులైన పరీక్షకుల బోర్డు అలానే వైవా వోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా వి.జె. శైలజ రాణి రాసిన థీసిస్ డాక్టరేట్‌నకు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావు వి.జె. శైలజ రాణికి పిహెచ్‌డి నోటిఫికేషన్ ను ప్రకటించారు. ఈమె తన పరిశోధనలో భాగంగా నల్లమల అడవుల్లో పెరిగే వాటిలో నివాస ప్రాంతాల్లో అలంకరణ మొక్కలుగా ఉపయోగపడే 422 మొక్కలను ప్రత్యక్షంగా అటవీ ప్రాంతంలో పరిశీలించి గుర్తించారు. ఈ వివరాలతో కూడిన పుస్తకాన్ని త్వరలో ముద్రించనున్నట్లు పరిశోధకురాలు తెలిపారు. ఈమె ప్రస్తుతం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆమెను విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర శాఖను అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు అభినందించారు.

పేదల ఆరోగ్యమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, ఆరోగ్యం కోసం మరో కీలక నిర్ణయం తీసుకుందని, ఇప్పటివరకు రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న బియ్యం, చక్కెర, రాగులు, జొన్నలతో పాటు జనవరి నుంచి అదనంగా 'పోషక విలువలు కలిగిన గోధుమ పిండిని' కూడా పంపిణీ చేస్తూ ఉందని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గౌస్ నగర్ ప్రాంతాల్లోని రేషన్ షాపుల వద్ద గోధుమ పిండి పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ప్రజలు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్, ఎన్నారై టిడిపి కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా, పౌరసరఫరాల డైరెక్టర్ సుబ్బరాయుడు యాదవ్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటిలో రెండో రోజూ నిరసన

ప్రజాశక్తి - వేంపల్లె : ఆర్‌జియుకెటి పరిధిలోని ట్రిపుల్ ఐటిలో పని చేస్తున్న కాంట్రాక్టు టీచింగ్ గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరసన కార్యక్రమం శుక్రవారం 2వ రోజుకు చేరుకుంది. మండలంలోని ఇడుపులపాయి ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటి యాజమాన్యంపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు నజీర్ హుసేన్ మాట్లాడుతూ ఆర్‌జియుకెటి పనిచేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి 8 సంవత్సరాలుగా ఎలాంటి ప్రయోజనాలు అందకుండా చేశారని వాపోయారు. కూటమి ప్రభుత్వం కనీస వేతనం అందించకపోవడం దారుణం అన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు, రేపు బ్రెయిలీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాయల్ అంధుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 3,4 తేదీలలో బ్రెయిలీ 217వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి ప్రకాష్ ఒడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న ఉదయం 9:30 గంటలకు శంకరాపురంలోని అంధుల పాఠశాలలో ప్రారంభ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. క్రీడా పోటీలు ఉంటాయని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. 4న కలెక్టరు, ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు. సాయంత్రం ముగింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్‌ఒ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని 15వ డివిజన్, రామాంజనేయపురంలో ఉన్న ఎపి ఉర్దూ బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, మౌలిక వసతుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్, 15వ డివిజన్ ఇన్‌ఛార్జి రెడ్డయ్య యాదవ్, 3వ డివిజన్ ఇన్‌ఛార్జి సుదర్శన్ రెడ్డి, 2వ డివిజన్ ఇన్‌ఛార్జి సుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బయ్య, రమణారెడ్డి, వరప్రసాద్, షరీఫ్, ఈశ్వరయ్య, వినోద్ కుమార్, వినోద్ కుమార్ రెడ్డి, ఆర్గనైజర్ సెక్రెటరీ శిలాస్, పాఠశాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టైల్ యూనియన్ షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి కడప అర్బన్

నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'స్టైల్ యూనియన్' షాపింగ్ మాల్‌ను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరం వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతుండటం సంతోషకరమని పేర్కొన్నారు. నూతన వస్త్ర ప్రపంచం నగర ప్రజలకు అందుబాటులోకి రావడం శుభపరిణామమని తెలిపారు. స్టైల్ యూనియన్ మాల్ యాజమాన్యం ఎస్. ఓబులేసు, ఎస్. ఆనంద్ బాబు, ఎస్. అశోక్ కుమార్, ఎస్. రెడ్డి బాబు, ఎస్. రెడ్డి కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారం దినదినాభివ ృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం స్టైల్ యూనియన్ యాజమాన్యం మాట్లాడుతూ మా షోరూంలో సొంత మ్యానుఫ్యాక్చర్‌తో తయారు చేసిన జెంట్స్, ఉమెన్స్, గర్ల్స్, కిడ్స్ కు సంబంధించిన అన్ని రకాల రెడీమేడ్ దుస్తులు లభిస్తాయని చెప్పారు. అవకాశం కడప ప్రజలు సద్వినియోగం చేసుకుని మమ్మల్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నగర ప్రజలు, ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

- నూర్‌బాష్, దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు డి.ఖాదరయ్య

ప్రజాశక్తి - కడప

టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారని నూర్‌బాష్, దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు డి.ఖాదరయ్య, జిల్లా గౌర వాధ్యక్షులు ఆయిల్‌మిల్ ఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం దూదేకుల భవన్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతోపాటు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించేలా చూడాలన్నారు. లేనిపోతే నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడం కష్టంగా మారుతుందని గ్రహించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దూదేకుల పిల్లలు ముందంజలో నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజికంగా ఎంతో వెనుకబడిన దూదేకులు మరికొంతకాలం వెనుకబడిన కులాల జాబితాలో ఉండిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వెనుకబాటుతనాన్ని చదువు ద్వారా మాత్రమే అధిగమించవచ్చని రుజువైందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన, ఉన్నతశ్రేణిలో నిలిచిన కులాల ఎదుగుదలకు పరిశీలిస్తే తెలుస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం జిల్లా నాయకులు పి.ఎం.బాషా, రిటైర్డు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.మస్తాన్‌సాహెబ్, టీచర్ వై.అజ్మతుల్లా, డి.మస్తాన్, ఆర్‌డబ్ల్యుఎస్ రహీం, కె.మల్లికార్జున పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

సెమిస్టర్ ఫలితాల్లో ఎస్ఆర్ఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఎపి ఎస్‌బి టెట్ డిప్లమో సెకండ్ ఇయర్, థర్డ్ సెమిస్టర్ డిప్లమో థర్డ్ ఇయర్ 5వ సెమిస్టర్ ఫలితాలలో సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాదరంగనాథ్ తెలిపారు. డిప్లమో సివిల్ బ్రాంచ్ సెకండ్ ఇయర్‌లో ఎల్. వర్షిత 86.3, ఇ. ప్రియదర్శిని 80.0, వి.అక్షయ 75.1, ట్రిపుల్ ఈ కె. శివగోవర్ధన్‌రెడ్డి 94, సి. నవ్య 89.8, ఆర్.మహబూబ్ షరీఫ్ 87.5, సిఎంఇలో జె. నిర్మల 93.7, పి. నందిని 93.7, ఎస్.తనూజ 93.3,ఎ.రమ్య రెడ్డి 92.3, మెకానికల్ విభాగంలో పి.మునాఫ్ 81.3, ఇసిఇ విభాగంలో ఎస్.గులాబ్ జాన్ 95.3, జి.నాగ శ్వేత 91.1 మార్కులు సాధించారని చెప్పారు. థర్డ్ ఇయర్ ఫిఫ్త్ సెమిస్టర్ ఫలితాలలో మెకానికల్‌లో టి.శివకుమార్ 89.5, ఇసిఇలో కె.వెంకటేష్ 94.90, కె.నందిని 94.70, పి. వెంకటరాముడు 91.60 మార్కులు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. జెఎన్‌టియు అనంతపురం బిటెక్ ఫైనల్ ఇయర్ ఫస్ట్ సెమిస్టర్ విడుదల చేసిన ఫలితాలలో సివిల్ బ్రాంచ్‌లో ఎస్.శభ అలీల్ 78, ఎ.జలాలుద్దీన్ 77, ఏ ధరణి 76, కె.కావ్య 76, ట్రిపుల్ ఈలో సి.భాగ్యలక్ష్మి 82.88, యు.జ్యోతి స్వరూప 82.13, ఎస్.దేవిశ్రీ 81.25 ఇసిఇ విభాగంలో యు.ఉమా 82.50, ఎస్. శాలిని 81.75, జి.నాగలక్ష్మి 81.75, వి. మానస 79.87, సిఎస్‌ఇలో టి.వంశీ 82, ఆర్.షేక్ సఫియా 81.23, సి.త్రిపురాంబిక 79 మార్కులు సాధించి కళాశాల మంచి పేరు తీసుకువచ్చారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థిని విద్యార్థులను చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ .వెంకటేశ్వర్ రెడ్డి, హెచ్ఒడి లు అభినందించారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు

డి.కె.చదువుల బాబుకు ఆహ్వానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈనెల 3, 4, 5వ తేదీలలో గుంటూరులోని శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ క్షేత్రంలో నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలలో వక్తగా పాల్గొనవలసిందిగా కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డి.కె.చదువుల బాబును గజల్ శ్రీనివాస్ ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాకవి శ్రీ శ్రీనాథ కవి సదస్సుల వేదికపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభలలో 28 సాహిత్య సదస్సుల్లో ప్రముఖ సాహితీ వేత్తల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని, ఆరు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్య మంత్రులు, కేంద్ర మంత్రులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, 50 దేశాల సాహిత్య సంఘాల ప్రతినిధులు, సాహితీ వేత్తలు, సినీ రంగ ప్రముఖులు పాల్గొనే సభలను ప్రతి ఒక్కరూ సందర్శించాలని ఆయన పేర్కొన్నారు. **ప్రొద్దుటూరు:** ఈ నెల 3, 4, 5 తేదీలలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించే మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు కడప జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యంకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం అందినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. సభలో జాషువా కవుల కవి సమ్మేళన వేదికలో తనకు పాల్గొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు. **పులివెందుల టౌన్:** ప్రపంచ తెలుగు మహాసభలకు కడప జిల్లా కవులకు ఆహ్వానం అందింది. పులివెందులకు చెందిన అల్లం రంగనాయకులు రాయల్, బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్లకు చెందిన బొల్లు రామా మోహన్‌లకు ఈనెల 3,4 ,5 వ తేదీలలో గుంటూరులో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలలో ప్రతినిధులుగా పాల్గొనేందుకు ఆహ్వానం లభించిందని పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ఆయా గ్రామాలలో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రీ సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందని తహశీల్దార్ రమణమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని భూమాయ పల్లె గ్రామ పరిధిలోని బి. కొత్త పల్లెలో సర్వేనెంబర్ 300 నుంచి రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రీ సర్వేపైన రైతులకు ఏమైనా సందేహాలుంటే రెవెన్యూ అధికారులను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. మైదుకూరు నియోజకవర్గ వైసిపి రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి మాట్లాడుతూ రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా, ఎటువంటి అపోహలకు తావు లేకుండా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.వై.సుదర్శన్‌రెడ్డి, చిట్టి భోయిన కృష్ణ యాదవ్, ఎం.జె సుబ్బారెడ్డి, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని జిల్లా వెలుగు డిపిఎం, ప్రకృతి వ్యవసాయ అధికారి రమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఖాజీపేట వెలుగు కార్యాలయంలో 'నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్' కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లూరు నాగసానిపల్లి త్రివరం, కొత్తపల్లె, వెంపల్లె, పత్తూరు గ్రామాల ప్రకృతి వ్యవసాయ సాగుకు ఎంపిక అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సభ్యులు భాస్కర్ రెడ్డి, ఏఓ నాగార్జున, ఎపిఎం తెలుగు పాల్గొన్నారు. **చెన్నూరు:** 'సేంద్రియ ఎరువులతో పండించిన పంట ఆరోగ్యానికి సురక్షితమని ఎపిఎం ఎస్తేరు రాణి పేర్కొన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్యలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డిఆర్‌డిఏ వెలుగు, వ్యవసాయ ఎపిఎం ఎంఎఫ్, ఉద్యాన వన శాఖ, సిబ్బందితో కలిసి సమన్వయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కె. శివారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతి ఒక్కరు కల్తీలేని ఆరోగ్యం, ఆదాయం, భూమికి సారవంతం కావాలంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ఎంఏఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రసాయన మందులు వాడడం వల్ల పంటలకు తెగుళ్ళు, పురుగులు, వైరస్ వచ్చి భూమి సారవంతం దెబ్బతింటుందని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రతాప్, ఎసిఆర్‌పిలు, విఏఎలు, ఒపిలు, ఒబిలు, సిఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలం లెక్కలవారిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో రోటరీ ఐ హాస్పిటల్ కంటి వైద్య నిపుణురాలు సుజాత, టెక్నీషియన్ షఫ్లీక్ 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 23 మందిని కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జయభారత రెడ్డి మాట్లాడుతూ రోటరీ హాస్పిటల్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కె.నరసింహులు మాట్లాడుతూ రోటరీ అంతర్జాతీయ సేవా సంస్థ అని, ఆరోగ్యం, విద్య పర్యావరణం పైన విశేషంగా కృషి చేస్తుందన్నారు. పాఠశాలలో ఇటువంటి సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, రోటరీ ఐ హాస్పిటల్ ప్రెసిడెంట్ ఎం.వి.ఎస్ ప్రభు, స్కూల్ కమిటీ చైర్మన్ ఎస్ఎం బాష, ఉపాధ్యాయులు పి.రాజశేఖర్‌రెడ్డి, సాధిక్ మహమ్మద్, రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, రమాదేవి, అరుణ ,చంద్రకళ, లక్ష్మీదేవి, మాధవి, ఓబులేసు, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రెవెన్యూ సేవలు : డిఆర్ఒ



చాపాడు : పట్టాదారు పాస్ పుస్తకం అందజేస్తున్న డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు

ప్రజాశక్తి-చాపాడు

రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి, ఇన్‌ఛార్జి జెసి విశ్వేశ్వర నాయుడు తెలిపారు. శనివారం మండల పరిధిలోని అన్నవరం రెవెన్యూ గ్రామంలోని వెంగన్నవారి పల్లికి చెందిన 146 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు తహశీల్దార్ రమాకుమారి ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రీసర్వే నిర్వహించి పాసుపుస్తకాలు పంపిణీ చేసిందన్నారు. అయితే అందులో కొన్ని లోటు పాట్లు ఉండడంతో ప్రస్తుత ప్రభుత్వం తిరిగి నూతన పాసుపుస్తకాలు ముద్రించారని చెప్పారు. క్యూఆర్ కోడ్ కలిగిన పాస్ పుస్తకంలో రైతులకు సంబంధించిన అన్ని వివరాలు పొందుపరిచారన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా రీ సర్వే ప్రారంభమైందన్నారు. రైతులు రెవెన్యూ సేవ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరెక్టర్ అన్నవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ముఖ్యమంత్రి ఫొటోతో పాసుపుస్తకాలు ముద్రించి ఇచ్చారని, దీంతో కొందరి రైతుల మనోభావాలు దెబ్బతిన్నాయని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే నూతన పాస్ పుస్తకాలను రాజముద్రతో ముద్రించి పంపిణీ చేయడం మంచి విషయం అన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ నారాయణస్వామి, ఆర్ఐ శివశంకర్ రెడ్డి ,కేసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ లోకేశ్వర్ రెడ్డి ,విఆర్ఓ ఖలేక్, సర్వేయర్ లు, రైతులు పాల్గొన్నారు.



కాశినాయన : పాస్ పుస్తకం అందజేస్తున్న బసిరెడ్డి రవీంద్రారెడ్డి

రైతుల అభ్యున్నతే కూటమి లక్ష్యం : భూపేష్

జమ్మలమడుగు : రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని జిల్లా టిడిపి అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు మండల పరిధిలోని వేమగుంటపల్లి గ్రామ పంచాయతీలో జమ్మలమడుగు ఆర్‌డిఒ ఆదిమూలం సాయిశ్రీ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి హాజరయ్యా. మొత్తం 90 మంది రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయిశ్రీ, జమ్మలమడుగు తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు టి. శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు టి. మల్లికార్జున, అంబవరం నేత పి. రామయ్య, బొమ్మేపల్లి రఘునాథరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులు టిడిపి నాయకులు రైతులు పాల్గొన్నారు. **కాశినాయన :** రైతులకు ఎటువంటి భూ సమస్యలు లేకుండా చేయాలనే ప్రధాన లక్ష్యంతో ప్రభుత్వం రీ-సర్వే నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు చేపట్టిందని బద్వేల్ మార్కెట్ యార్డ్‌వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఓబులాపురంలో శుక్రవారం పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతుల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకట సుబ్బయ్య, డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్‌రెడ్డి, సర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజు, విఆర్ఓ చెన్నరాయుడు, నాయకులు పోల్‌రెడ్డి కొండ నరసింహారెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు. **లింగాల :** రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల సౌకర్యార్థం రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను తుంగభద్ర హెచ్ఎల్‌సి చైర్మన్ మా రెడ్డి జోగిరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని ఇప్పట్ల పంచాయతీ పరిధిలోని స్వస్రీం గ్రామంలోని 70 మంది రైతులకు పాత పుస్తకాల స్థానంలో కొత్త పాస్‌పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాలకులు ఫొటోలతో పాసుపుస్తకాలు ఉండేవని, కూటమి ప్రభుత్వం రాజముద్ర కూడిన పుస్తకాలను ముద్రించారని అన్నారు. కార్యక్రమంలో లింగాల సొసైటీ చైర్మన్ నవీన్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. **చక్రాయపేట :** మండలంలోని 11 గ్రామాల్లో భూములు రీ సర్వే నిర్వహించారు. కుమార్ కాల్వ, అద్దాలమర్రి, గొట్ల మెట్ల,కొండప్ప గారి పల్లి, ఆంజనేయపురం మహాదేవపల్లి గ్రామాలకు సంబంధించి 2158 పట్టాదారు పుస్తకాలు మంజూరైనట్లు తహశీల్దార్ విజయకుమారి తెలిపారు. శుక్రవారం నెరుసుపల్లె గ్రామంలో టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 905 పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఎద్దుల చంద్ర, కాలేటివాగు చైర్మన్ లోమడభాస్కర్‌రెడ్డి, నెరుసుపల్లె మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య ,టిడిపి యువ నాయకుడు రాహుల్, రైతులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **వల్లూరు :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే పూర్తయిన రైతులకు కొత్త పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని తహశీల్దార్ శ్రీవాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంకటేశాపురం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ లేబాక నాగేశ్వర్‌రెడ్డి, టిడిపి నాయకులు రామ సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు. **మైలవరం :** మండలంలో రీ - సర్వే పూర్తయిన పొలాలకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం లింగాపురం గ్రామంలో గ్రామ సభను నిర్వహించి లింగాపురం, ఖాదరాబాద్ గ్రామాల రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను శనివారం నుంచి పంపిణీ చేయనున్నట్లు నాగేశ్వర రావు తహశీల్దార్ పంపిణీ చేశారు. ఈనెల 9 వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



జమ్మలమడుగు : పాస్ పుస్తకం అందజేస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ, భూపేష్‌రెడ్డి



చక్రాయపేట : పట్టాదారు పాస్‌పుస్తకం అందజేస్తున్న తహశీల్దార్, మహేశ్వర్‌రెడ్డి

విద్యుత్ ఛార్జీల తగ్గింపు ప్రయోజనకరం

- మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యుత్ ఛార్జీల తగ్గింపు ప్రజలకు ప్రయోజనకరమని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెల లింగారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఈ తరుణంలో మొదటగా మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సామాజిక పింఛన్ల పెంపు, దీపం పథకం, తల్లికి వందనం, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలతో పాటు అన్నా క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి సంక్షేమం పాలన అందిస్తున్నారని చెప్పారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణంతో పాటు పరిశ్రమల ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తున్నారని వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహం రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యుత్ సంస్థలకు నష్టాలు రావటం, అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరుతో సుమారు రూ. 30 వేల కోట్ల మేర భారం వేస్తే కూటమి ప్రభుత్వం వాటిని అధిగమించి, ప్రభుత్వానికి అదనపు భారమైనా నూతన సంవత్సరం సందర్భంగా దాదాపు రూ. 4497 కోట్ల విద్యుత్ బిల్లుల భారం తగ్గించనుందని చెప్పారు. గత సంవత్సరం 990 యూనిట్ల ట్రూ అప్ ఛార్జీలు తగ్గించారని స్పష్టం చేశారు. దీనికి తోడు ఎస్‌సి కార్పోరేషన్‌లో ఎస్‌సి సోదరుల రుణాలకు వడ్డీ రూ. 1100 కోట్ల మేర మాఫీ చేశారని, కానిస్టేబుల్ ఉద్యోగాలు పారదర్శకంగా అందించారని, ట్రైనింగ్ లో కానిస్టేబుళ్లకు రూ.12000 కు స్టయిఫండ్ పెంచారని తెలిపారు. జిల్లాల పునర్విభజనలో రాయచోటి జిల్లా కేంద్రంగా గతంలో అన్నమయ్య జిల్లా వున్న నేపథ్యంలో, మదనపల్లె ప్రజల ఆకాంక్ష మేరకు జిల్లా ఏర్పాటు అనివార్యం కావడంతో, 3 ప్రాంతాలకు జిల్లా హోదా ఇవ్వటం ఆర్థిక భారం అయ్యే నేపథ్యంలో ప్రజాభీష్టం మేరకు రాజంపేటను కడపలో, రైల్వే కోడూరును తిరుపతిలో చేర్చి, రాయచోటిని అన్నమయ్య జిల్లాలోనే కొనసాగిస్తూ, మదనపల్లె కూడా అనువైన ప్రాంతం కావడంతో అన్నమయ్య జిల్లా కేంద్రం అక్కడికి మార్చారని తెలిపారు. కాగా కేవలం రాజకీయ లబ్ది కోసమే పలువురు రాయచోటి జిల్లా కేంద్రంపై నిరసనలు చేయడం సబబు కాదన్నారు. రాయచోటి కూడా మొదటి నుంచి జిల్లా కేంద్రం కాదని పరిస్థితులు అర్థం చేసుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ సైనికులకు ప్రభుత్వం ఇచ్చే భూములు, ఇనాముల భూములను చుక్కల భూమిగా ఉండటం ఇబ్బందికరం కావడంతో 22ఎ రద్దు కూడా పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా పరిస్థితి కల్పించారని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కూనపూరి రాము నాయుడు, కామిశెట్టి బాబు, టప్పా మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ప్రొద్దుటూరును సుందరీకరిస్తాం

- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరును సుందరీకరిస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని రాజేశ్వరి కాలనీలో వికసిత్ భారత్ - జి రామ్ జి నిధులు రూ.1 కోట వ్యయంతో సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో, పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లు, కాల్వలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, సుందరంగా తీర్చిదిద్దుతామని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాఘవ రెడ్డి, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, నాయకులు బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, బసిరెడ్డి వీరకుమార్ రెడ్డి, శివాలయం చైర్మన్ వంగల నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మారుతి ప్రసాద్ రెడ్డి, కాకిరేణి పల్లె లక్ష్మీనారాయణరెడ్డి, కాకిరేణి పల్లె గురివిరెడ్డి, పంచాయతీ రాజ్ డిఇ లక్ష్మీనారాయణ రెడ్డి, ఎఇ గణేష్ పాల్గొన్నారు.

విద్యారంగ సంక్షేమమే పరమావధి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యారంగ సంక్షేమమే పరమావధి అని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు నర్రెడ్డి సంగమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ఎస్‌టియు రూపొందించిన పదోతరగతి స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎం ప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం మాత్రమేగాక విద్యార్థుల భవిష్యత్తుకు కూడా పాటుపడుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేస్తామని సంఘ రాష్ట్ర అకడమిక్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఎస్‌సి స్టడీ మెటీరియల్ గత సంవత్సరం సి, డి గ్రూప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో ఈ మెటీరియల్‌ను ఫాలో అయిన చాలామంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని అన్నారు. కార్యక్రమంలో ఎస్టియు జిల్లా నాయకులు ధర్మారెడ్డి, జనార్దన్ రెడ్డి, లక్ష్మీనరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు డిసి గోవిందు, మహబూబ్ బాషా, అక్బర్ బాషా, నరసింహారెడ్డి, సిరాజుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - చాపాడు



కేక్ కట్ చేస్తున్న వైద్యాధికారి ఓబులేసు

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి. ఓబులేసు తెలి పారు. పిహెచ్‌సి సూపర్ వైజర్స్, ఎంఎల్ హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నూతన సంవత్సర సందర్భంగా శుక్రవారం ఆయన్ను శాలువాలతో, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను నియమ నిబద్ధతతో చేయాలన్నారు. పిహెచ్‌సికి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొని రావాలని సిబ్బందికి తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉండే అన్ని రకాల కార్యక్రమాలు విజయవంతమయేట్టు చేయాలని, విధులలో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండి ఆరోగ్య సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధి కారి రాఘవయ్య, సూపర్‌వైజర్స్ ప్రసాద్, భవానీ, ఎంఎల్ హెచ్‌పిలు రాజ రాజేశ్వరి, ఉషా, ఫర్హాట్ అంజుమ్, ల్యాబ్ టెక్నీషియన్ సుధాకర్, ఎఎన్ఎం వనజ, ఆశా కార్యకర్తలు పోతులూరమ్మ, ఓబులమ్మ, సావిత్రీ, జయమ్మ పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ మార్కులు సాధించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం : పది ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించేందుకు ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం జడ్‌పిహైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు కేవలం వంద రోజులు మాత్రమే ఉందన్నారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు ఒక టైం టేబుల్ ఏర్పాటు చేసుకుని దాని అనుగుణంగా చదవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సైతం కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని చెప్పారు. విద్యార్థులు పరీక్షల సమయం ఎంతో కీలకమైందన్నారు. వందరోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం చదివి ఉత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఖాదర్‌బాషా, ఇన్‌ఛార్జి హెచ్ఎం రవీంద్ర, ఎంఐఎస్ అరవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.